క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈ నెల 4న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని టీజీ ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. హనుమకొండ చౌరస్తా ఫీడర్‌లోని లష్కర్ బజార్, లష్కర్ బజార్ మెయిన్ రోడ్డు ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయినగర్ ఫీడర్‌లోని లష్కర్ బజార్, లష్కర్ బజార్ మెయిన్ రోడ్డులో మధ్యాహ్నం 12 గంటల నుంచి 2 గంటల వరకు, సుబేదారి చోటీ మసీదు, కేఎల్ఎస్ రెడ్డి కాలనీ, సుబేదారి ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే, వరంగల్‌లోని పలు ప్రాంతాల్లో గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ వరంగల్ టౌన్ డీఈ శంకేశి మల్లికార్జున్ తెలిపారు. కాశిబుగ్గ నుంచి పోచమ్మమైదాన్ రోడ్డు, చార్‌బౌలి, నిజాంపుర, మండిబజార్, ఎల్‌బీ.నగర్, గోవిందరాజుల గుట్ట, లక్ష్మీపూర్, కూరగాయల మార్కెట్ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

హసన్‌పర్తి: హసన్‌పర్తి ఫీడర్‌లో ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ శిరీష్ తెలిపారు.

7న సామూహిక విష్ణు సహస్రనామ పారాయణం



వరంగల్ చౌరస్తా: వరంగల్ గోవిందాద్రి కొండపై గోవిందరాజస్వామి గుట్టపై ఈనెల 7న గోవిందాద్రి గోశాల సామూహిక విష్ణు సహస్రనామ పారాయణం జరుగుతుందని ప్రధాన అర్చకుడు వరయోగుల శ్రీనివాస్ స్వామి తెలిపారు. ఈ మేరకు ఆలయ ఆవరణలో వాల్ పోస్టర్లను బుధవారం ఆవిష్కరించారు. ఆలయ అర్చకుడు గోవిందాద్రి గోశాల వ్యవస్థాపకులు లక్ష్మణ స్వామి, తాడూరి గోపిస్వామి, ప్రసాద్‌స్వామి, వరయోగుల నరేష్ స్వామి, మురళీకృష్ణ స్వామి పాల్గొన్నారు.

'ట్రైన్ డ్రైవర్స్' పుస్తకావిష్కరణ



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ సోషియాలజీ విభాగానికి చెందిన డాక్టర్ కిన్నెర వెంకటేశ్వర్లు రచించిన ట్రైన్ డ్రైవర్స్ అనే పుస్తకాన్ని వీసీ ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రామచంద్రం బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో సోషియాలజీ విభాగం అధిపతి డాక్టర్ స్వర్ణలత, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ అయిలయ్య, డాక్టర్ కిన్నెర వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

నియామకం



హన్మకొండ: బీసీ సంక్షేమ సంఘం హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షుడిగా తేళ్ల కిశోర్‌ను నియమించినట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బైరి రవికృష్ణ గౌడ్ తెలిపారు. ఈ మేరకు ఆయనకు బుధవారం నియామక పత్రం అందించారు.

రైతులకు యూరియా కష్టాలు



హసన్‌పర్తి: రైతులకు యూరియా కష్టాలు తీరడం లేదు. మంగళవారం రాత్రి సొసైటీలకు యూరియా రావడంతో తెల్లవారుజాము నుంచే రైతులు బారులు దీరారు. పరిస్థితి అదుపు తప్పే పరిస్థితి ఉందనే సమాచారంతో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. క్యూలైన్‌లో నిలబడిన రైతులు చివరికి యూరియా అందక నిరాశతో వెనుదిరిగారు.

రైతు సంఘంలో సభ్యత్వాలు

కాజీపేట: కాజీపేట మండలం దర్గా కాజీపేట సొసైటీ ఆధ్వర్యంలో కొత్తగా ఏర్పాటు కానున్న రైతు ఉత్పత్తిదారుల సంఘంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభమైనట్లు ఏఈఓ భరత్ తెలిపారు. నూతన సభ్యత్వం తీసుకోవాలని ఆసక్తి ఉన్న రైతులు పట్టా పాస్‌బుక్, ఆధార్‌కార్డు జిరాక్స్‌లను దర్గా సొసైటీ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. సభ్యత్వ రుసుం రూ.2 వేలుగా నిర్ణయించినట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 94401 38409 నంబర్‌కు సంప్రదించాలన్నారు.

శ్మశాన వాటిక పరిశీలన



కాజీపేట రూరల్: దర్గా కాజీపేటలోని గాంధీనగర్‌లోని శ్మశాన వాటికను అభివృద్ధి చేయాలని సీపీఎం కాజీపేట మండల నాయకుడు తొట్టె మల్లేషం డిమాండ్ చేశారు. ప్రజా సమస్యల అధ్యయనంలో భాగంగా శ్మశాన వాటికను బుధవారం సందర్శించారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి ఓరుగంటి సాంబయ్య, జంపాల రమేష్, బద్రి, మేకమల్ల బాబు పాల్గొన్నారు.




వరంగల్ అండర్ బ్రిడ్జి జీపుల అడ్డా వద్ద తక్కువ ఎత్తులో ఉన్న తీగలు



వరంగల్ అండర్ బ్రిడ్జి జీపుల అడ్డా వద్ద గజిబిజిగా ఉన్న కేబుళ్లు

వరంగల్ జేపీ రోడ్డులో అస్తవ్యస్తంగా ఉన్న టెలిఫోన్, డిష్, ఇంటర్‌నెట్ కేబుళ్లు



తీగలు.. ప్రమాదాలకు తోవలు

వేలాడుతున్న విద్యుత్ తీగల కారణంగా ఇటీవల రాష్ట్రంలోని పలు చోట్ల నలుగురు యువకులు ప్రాణాలు విడిచిన విషయం తెలిసిందే. గ్రేటర్ వరంగల్ నగరంలో అనేక చోట్ల స్తంభాలకు తీగలు వేలాడుతున్నాయి. టెలిఫోన్ వైర్లు, డిష్ వైర్లు, ఇంటర్‌నెట్, విద్యుత్ తీగల కారణంగా స్తంభాల వద్ద గజిబిజి వాతావరణం నెలకొంది. గణేశ్ విగ్రహాల ఊరేగింపు, నిమజ్జనం వేళ కిందికి వేలాడుతున్న తీగలు తాకి ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. ప్రమాదం జరగకముందే విద్యుత్ శాఖ అధికారులు స్పందించాల్సిన అవసరం ఉంది.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, వరంగల్



కచోల్ల గల్లీలో తక్కువ ఎత్తులో ఉన్న తీగలను చూపుతున్న స్థానికుడు



వరంగల్ హెడ్ పోస్టాఫీస్ సమీపంలో ప్రమాదకరంగా ఉన్న తీగలు

వినాయక నిమజ్జన ప్రదేశాల పరిశీలన



ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలిస్తున్న మల్లికార్జున్



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఏసీపీ ప్రశాంత్‌రెడ్డి

హన్మకొండ: వరంగల్‌లో వినాయక నిమజ్జన ప్రదేశాలను టీజీ ఎన్పీడీసీఎల్ వరంగల్ టౌన్ డీఈ శంకేశి మల్లికార్జున్, ఏడీఈ, ఏఈలు పరిశీలించారు. చిన్న వడ్డెపల్లి చెరువు, అగర్తల చెరువు, కట్ట మల్లన్న చెరువులను బుధవారం సందర్శించారు. నిమజ్జన ప్రదేశాలకు సమీపంలోని విద్యుత్ సబ్‌స్టేషన్లు, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లను పరిశీలించి విద్యుత్ అంతరాయం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. ఏడీఈ బి.కిశోర్, ఏఈలు రామకృష్ణ, ఎ.అజయ్, సిబ్బంది పాల్గొన్నారు.

హసన్‌పర్తి పెద్ద చెరువు వద్ద..

హసన్‌పర్తి: హసన్‌పర్తి పెద్ద చెరువును కాజీపేట ఏసీపీ ప్రశాంత్‌రెడ్డి, డీఎంహెచ్ఓ డాక్టర్ అప్పయ్య బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా గణేష్ నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించారు. ఊరేగింపు సందర్భంగా భారీ బందోబస్తు ఏర్పాటు చేయాలని సిబ్బందికి ఏసీపీ సూచించారు. ఈ సందర్భంగా అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ ఇన్‌స్పెక్టర్ చేరాలు, ఎస్సై దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలి



ధర్నా చేస్తున్న పార్టీ నాయకులు

ఖిలా వరంగల్: అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని ఎంసీపీఐ (యూ) నగర కమిటీ కార్యదర్శి మాలోతు సాగర్, కార్యదర్శివర్గ సభ్యులు చుంచు జగదీశ్వర్, ముక్కెర రామస్వామి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఖిలా వరంగల్ తహసీల్దార్ కార్యాలయం వద్ద బుధవారం ధర్నా నిర్వహించి తహసీల్దార్ శ్రీకాంత్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నిక హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చడం లేదని ఆరోపించారు. వర్షానికి దెబ్బతిన్న రోడ్లు, డ్రెయినేజీలను అభివృద్ధి చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఐతం నగేష్, ఎగ్గని మల్లికార్జున్, మాలి ప్రభాకర్, మంద రవి, మాలోతు ప్రత్యూష, అడుప యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

కేయూ క్యాంపస్: పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలని ఏబీవీపీ వరంగల్ విభాగ్ కన్వీనర్ ఆరెపల్లి సుజిత్ డిమాండ్ చేశారు. హనుమకొండలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో విద్యార్థులతో బుధవారం నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను సకాలంలో విడుదల చేయకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో ఏబీవీపీ జిల్లా కన్వీనర్ దూళిపూడి హరిచరణ్, నగర కార్యదర్శి బెల్లం కార్తీక్, నగర ఉపాధ్యక్షుడు నవీన్, బాధ్యులు రాహుల్, త్రినిష్, అభియాన్ పాల్గొన్నారు.

జాబ్ క్యాలెండర్ ప్రకటించాలి

జాబ్ క్యాలెండర్‌ను సర్కారు ప్రకటించాలని స్వేరో స్టూడెంట్స్ యూనియన్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఎల్తూరి సాయికుమార్ డిమాండ్ చేశారు. కేయూలోని గెస్ట్ హౌజ్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలాగే ఈ ప్రభుత్వం కూడా విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయడం లేదని విమర్శించారు. సమావేశంలో యూనియన్ నాయకులు ప్రతాప్, అజయ్, వెంకటేష్, చొదరి, శ్రీకాంత్, మహదేవ్, టీకాజీ, రాజు, గణేష్, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

వాగ్దేవి కళాశాల డిగ్రీ పరీక్ష ఫలితాలు విడుదల



ఫలితాలు విడుదల చేస్తున్న శేషాచలం, తదితరులు

హన్మకొండ: వాగ్దేవి డిగ్రీ, పీజీ కళాశాల (స్వయం ప్రతిపత్తి) అండర్ గ్రాడ్యుయేట్ కోర్సుల 2వ సెమిస్టర్ పరీక్షా ఫలితాలు విడుదలయ్యాయి. ఈ మేరకు హనుమకొండ నయీంనగర్‌లోని కళాశాలలో ప్రిన్సిపాల్, చీఫ్ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ ఎ.శేషాచలం విడుదల చేశారు. మొత్తం 1,515 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా, 947 మంది ఉత్తీర్ణులయ్యారు. బీబీఏలో 63.74 శాతం, బీకామ్‌లో 59.82 శాతం, బీఎస్సీ (లైఫ్ సైన్సెస్)లో 65.56 శాతం, బీఎస్సీ (ఫిజికల్ సైన్సెస్)లో 59.12 శాతం, బీసీఏలో 68.04 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు వివరించారు. కార్యక్రమంలో కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ సి.దత్తాత్రేయులు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ హరేందర్ రెడ్డి, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ రాజప్రసాద్ పాల్గొన్నారు.

ఔషధ పరిజ్ఞానం పెంచుకోవాలి



ఇంటర్వ్యూలో నాట్కో ఫార్మా కంపెనీ అధికారులు

మామునూరు: విద్యార్థులు ఔషధ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని వాగ్దేవి విద్యాసంస్థల డైరెక్టర్ చందుపట్ల వాణీదేవి సూచించారు. ఖిలా వరంగల్ మండలం బొల్లికుంట వాగ్దేవి ఫార్మసీ కళాశాలలో నాట్కో ఫార్మా లిమిటెడ్ సంస్థ ఆధ్వర్యంలో పూల్ క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్‌ను బుధవారం నిర్వహించారు. క్యాంపస్ డ్రైవ్‌లో భాగంగా ఎంఎస్సీ, (కెమిస్ట్రీ, మైక్రో బయాలజీ), బీఫార్మసీ, బీఎస్సీ, (కెమిస్ట్రీ) బీటెక్ (బయో టెక్నాలజీ / కంప్యూటర్ సైన్స్ / ఐటీ) విద్యార్థులకు ఫార్ములేషన్ యూనిట్‌లో ప్రొడక్షన్, క్వాలిటీ కంట్రోల్, మైక్రో బయాలజీ, ఐటీ విభాగాల నియామకాల కోసం ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ సందర్భంగా 20 మంది ఎంపికయ్యారని ఆమె వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ ఆర్.శివకుమార్, నాట్కో ఫార్మా ప్రతినిధులు వి.శ్రీనివాసులు, రామకృష్ణ, అంజిత్‌రావు, రంగతేజ, ఎండి.ఫారూఖ్ పాల్గొన్నారు.

మావోయిస్టు ఏసోబుకు ఘన నివాళి



ఏసోబు వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్న కుటుంబ సభ్యులు, గ్రామస్తులు

మడికొండ: మావోయిస్టు నేత మాచర్ల ఏసోబు అలియాస్ జగన్ అలియాస్ దాదా రణదేవ్ మొదటి వర్ధంతిని కాజీపేట మండలం టేకులగూడెం గ్రామంలో ఆయన కుటుంబ సభ్యులు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసోబు చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన గతేడాది సెప్టెంబర్ 3వ తేదీన ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ – దంతెవాడలో మధ్యలో జరిగిన ఎదురుకాల్పుల్లో మృతి చెందాడు. వర్ధంతి కార్యక్రమంలో ఏసోబు కుమారుడు మహేష్‌చంద్ర, కుటుంబీకులు, గ్రామస్తులు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ కాలనీలో 'వరద'



కాలనీలోకి వచ్చిన వరద నీరు

హసన్‌పర్తి: రెండో డివిజన్ గుండ్లసింగారంలోని ఇందిరమ్మ కాలనీ ముంపునకు గురైంది. ఒక్కసారిగా వరద నీరు భారీగా కాలనీలోకి చేరడంతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు. బుధవారం మధ్యాహ్నం ఎల్ఎండీ నుంచి వరంగల్‌కు జలాలు విడుదల చేశారు. గుండ్లసింగారం వద్ద ఉన్న షట్టర్ కొంతభాగం దెబ్బతినగా, దానికి మరమ్మతు చేయడానికి అధికారులు పైకి ఎత్తారు. దీంతో కాల్వలో నుంచి వరద నీరు కాలనీకి వచ్చింది.

నిధులు మంజూరు చేయండి

హన్మకొండ: అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని మహిళా కాంగ్రెస్ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు బంక సరళ కోరారు. ఈ మేరకు బల్దియా కార్యాలయంలో కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్‌ని బుధవారం కలిసి ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి పంపిన లేఖను అందించారు. కుడా కాలనీలో ఉప నిర్మిత కేంద్రం వద్ద నాలాపై కొత్త కల్వర్టు నిర్మాణానికి రూ.49.99 లక్షలు, టీవీ టవర్ కాలనీ ఎస్‌పీఆర్ స్కూల్ వద్ద నాలాపై శ్లాబ్ నిర్మాణానికి రూ.49.50 లక్షలు, గోకుల్‌నగర్‌లో డ్రెయిన్, కల్వర్ట్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ వినతి పత్రం అందించారు.

మెడికల్ కోడింగ్‌లో నైపుణ్యాలు పెంచుకోవాలి



మాట్లాడుతున్న అనిల్‌కుమార్

విద్యారణ్యపురి: మెడికల్ కోడింగ్ రంగంలో విద్యార్థులు నైపుణ్యాలు పెంచుకోవాలని మెడిసిన్ హెల్త్ కేర్ సొల్యూషన్స్ వ్యవస్థాపకుడు సంతోష్‌కుమార్ గుప్తా సూచించారు. హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్లేస్‌మెంట్ సెల్ అండ్ టీఎస్‌కేసీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని మెడిసిన్ హెల్త్ కేర్ సొల్యూషన్స్ సహకారంతో మెడికల్ కోడింగ్‌పై బుధవారం నిర్వహించిన వర్క్‌షాప్‌లో ఆయన ప్రధాన వక్తగా మాట్లాడారు. గ్లోబల్ ప్రొఫెషన్‌ను ధైర్యంగా, నైపుణ్యాలతో కొనసాగించాలన్నారు. వర్క్‌షాప్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ అనిల్ కుమార్ మాట్లాడుతూ మెడికల్ కోడింగ్ ప్రొఫెషనల్స్‌కు డిమాండ్ పెరుగుతోందన్నారు. వర్క్‌షాప్‌లో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ గుర్రం శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్ రజనీలత, రిసోర్స్ పర్సన్ డాక్టర్ నరేష్, టీఎస్‌కేసీ కోఆర్డినేటర్ రాజశేఖర్, అధ్యాపకులు శ్రీనివాస్, జీకే.కుమార్, వెంకన్న, రాజయ్య, అనిల్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్‌తో వ్యక్తిత్వ వికాసం పెంపు



మాట్లాడుతున్న శ్రీనివాసరావు

రామన్నపేట: సమాజ సేవ ద్వారా వ్యక్తిత్వ వికాసం పెంపొందించడంతో పాటు ఉత్తమ పౌరులుగా విద్యార్థులను తీర్చిదిద్దేందుకు ఎన్ఎస్ఎస్ దోహదపడుతుందని ఏవీవీ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ కోడిమాల శ్రీనివాసరావు అన్నారు. కళాశాలలోని మొదటి సంవత్సరం విద్యార్థులకు ఎన్ఎస్ఎస్‌పై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాంధీజీ ఆశయాలకు అనుగుణంగా 1969, సెప్టెంబర్ 24న 'నాకోసం కాదు మీకోసం' అనే లక్ష్యంతో భారత ప్రభుత్వ యువజన, క్రీడా శాఖ ఆధ్వర్యంలో జాతీయ సేవా పథకాన్ని ప్రారంభించినట్లు గుర్తుచేశారు. గత నాలుగు దశాబ్దాలుగా ఎన్ఎస్ఎస్ ద్వారా వివిధ సామాజిక రుగ్మతలపై అవగాహన కార్యక్రమాలు, చైతన్య కార్యక్రమాలు, లఘు నాటికలు, ర్యాలీలు నిర్వహిస్తూ ప్రజలను చైతన్యవంతం చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో మాజీ ప్రోగ్రాం ఆఫీసర్ ఎస్.సంజీవ, బరుపాటు గోపి, అధ్యాపకులు డాక్టర్ ఎస్.అనిత, శ్రీనివాస్, శ్రీధర్, వై.చండీశ్వర్, విజ్ఞాన్, స్వప్న పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

విద్యార్థులు నైపుణ్యాలు పెంచుకోవాలి

కేయూ క్యాంపస్: విద్యార్థులు నైపుణ్యాలను పెంచుకోవాలని హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జ్యోతి సూచించారు. కళాశాలలో ప్లేస్‌మెంట్ సెల్, ఇన్ఫోసిస్ సంస్థ ఆధ్వర్యంలో నైపుణ్య శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. ప్లేస్‌మెంట్ సెల్ డైరెక్టర్ జితేందర్, ఇన్ఫోసిస్ బాధ్యులు బాలచందర్ గోపాల్, గౌస్‌పాషా, దినేష్, స్వామి పాల్గొన్నారు.

వడ్డెర కులస్తులకు అండగా ఉంటాం

హన్మకొండ చౌరస్తా: వడ్డెర కులస్తుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య భరోసా ఇచ్చారు. హనుమకొండ కనకదుర్గ కాలనీలోని నివాసంలో ఎంపీ కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరిని వడ్డెర సంఘం జిల్లా నూతన అధ్యక్షుడు గండికోట సంపత్, బాధ్యులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పల్లపు మల్లికార్జున్, నగర అధ్యక్షుడు కంది శ్రీనివాస్, నాయకులు కందిరాజు, పల్లపు నవీన్, పల్లెపు నాగరాజు పాల్గొన్నారు.

గీత కార్మికులకు పింఛన్లు మంజూరు చేయాలి

కాజీపేట: ఉమ్మడి వరంగల్ జిల్లాలో చాలాకాలంగా అపరిష్కృతంగా ఉన్న గీత కార్మికుల పింఛన్ దరఖాస్తులను వెంటనే పరిశీలించి తగున్యాయం చేయాలని కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు గౌని సాంబయ్య గౌడ్ డిమాండ్ చేశారు. కాజీపేట 61వ డివిజన్ చైతన్యపురి కాలనీ కమ్యూనిటీ హాల్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ గౌడ్, జిల్లా గౌరవ అధ్యక్షుడు మోడెం రాజేందర్ గౌడ్, బుంగని రాజేంద్రప్రసాద్, క్రాంతి కుమార్, మహేష్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

కాజీపేట రూరల్: కాజీపేట రైల్వే డీజిల్‌కాలనీ సమస్యలపై సికింద్రాబాద్ రైల్వే చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్ (సీఎంఎస్) డాక్టర్ నారాయణస్వామిని కాజీపేట రైల్వే మజ్దూర్ యూనియన్ డీజిల్ బ్రాంచ్ నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. డీజిల్ బ్రాంచ్ సెక్రటరీ పాక వేదప్రకాష్, అసిస్టెంట్ సెక్రటరీ నరేష్‌యాదవ్, రైల్వే మజ్దూర్ యూనియన్ నాయకులు ఆర్.సమ్మయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాల్లో ముందుండాలి

హసన్‌పర్తి: క్లబ్ సభ్యులు సేవా కార్యక్రమాల్లో ముందుండాలని వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ చకిలం రాజేశ్వర్‌రావు అన్నారు. వాసవి క్లబ్ వారోత్సవాల్లో భాగంగా భీమారంలోని లార్డ్స్ వృద్ధాశ్రమంలో అన్నదాన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు సంద్రు నాగేందర్, కార్యదర్శి పురవర్దన్, కోశాధికారి మాధవశంకర్, మాజీ అధ్యక్షుడు కరంచంద్, నాగమళ్ల సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ వదిలిన బాణం 'కవిత'

హసన్‌పర్తి: కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో జరిగిన అవినీతిని పక్కదారి పట్టించడానికి కేసీఆర్ కొత్త నాటకానికి తెరలేపారని ఎన్ఎస్‌యూఐ జిల్లా మాజీ అధ్యక్షుడు వీసం సురేందర్‌రెడ్డి అన్నారు. అందుకు తన కుమార్తె కవితను పావుగా వాడుకుంటున్నారని విమర్శించారు. బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో సురేందర్‌రెడ్డి మాట్లాడారు.

మైనార్టీల మధ్య బీజేపీ చిచ్చు

ఖిలా వరంగల్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మైనార్టీల మధ్య అనైక్యతను సృష్టిస్తూ మతాల మధ్య విభజనను సృష్టిస్తూ పరిపాలన చేస్తోందని ఆవాజ్ రాష్ట్ర కమిటీ కార్యదర్శి అబ్బాస్ ఆరోపించారు. వరంగల్ ఉర్సు గుట్ట సీపీఎం జిల్లా కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఇస్మాయిల్, ఎండి.రహీం, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బీఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిరసన

కేయూ క్యాంపస్: గత లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి సీట్లు ఓటర్ల విశ్వసనీయతతో రాలేదని, ఓట్ల చోరీ ఫలితంగానే వచ్చాయని బీఎస్ఎఫ్ కాకతీయ యూనివర్సిటీ ఇన్‌చార్జ్, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు బొట్ల మనోహర్ ఆరోపించారు. కాకతీయ యూనివర్సిటీ మొదటి గేట్ ఎదుట బీఎస్ఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం నిరసన తెలిపారు. కార్యక్రమంలో నాయకులు నవీన్, దాసరి భరత్, సతీష్, వరుణ్, రమ్య, సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

మెట్ల బావిలో వ్యర్థాల తొలగింపు

ఖిలా వరంగల్: శివనగర్‌లోని మెట్ల బావిలో పేరుకుపోయిన చెత్తాచెదారం, వ్యర్థాలను బల్దియా ఆధ్వర్యంలో స్థానిక కార్పొరేటర్ దిడ్డి కుమారస్వామి పర్యవేక్షణలో బుధవారం తొలగించారు.

రైలుకింద పడి వ్యక్తి ఆత్మహత్య

ఖిలా వరంగల్: జీవితంపై విరక్తి చెందిన గుర్తుతెలియని వికలాంగ వ్యక్తి.. రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్న ఘటన బుధవారం మధ్యాహ్నం వరంగల్ రైల్వేస్టేషన్ జీఆర్పీ పోలీస్ స్టేషన్ పరిధిలోని కేసముద్రం రైల్వేస్టేషన్ యార్డ్ వద్ద జరిగింది. జీఆర్పీ పోలీసుల కథనం ప్రకారం 40 నుంచి 45 ఏళ్ల వయస్సు గల వ్యక్తి మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీకి తరలించి భద్రపర్చినట్లు జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ రాజు వివరించారు.

ఒకరిపై కేసు నమోదు

ఖిలా వరంగల్: మద్యం మత్తులో భార్యతోపాటు తల్లిని కర్రతో దాడి చేసిన కేసులో వరంగల్ కరీమాబాద్‌కు చెందిన సమ్మెట శ్రీకాంత్‌పై కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ బొల్లం రమేష్ తెలిపారు. శ్రీకాంత్ భార్య సమ్మెట సింధు ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

పాత కక్షలతో దాడి

ఖిలా వరంగల్: పాత కక్షలతో వరంగల్ లేబర్ కాలనీకి చెందిన ఇసంపెల్లి జెకోబ్‌పై జన్ను సంతోష్ దాడిచేసి తీవ్రంగా గాయపర్చాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ బొల్లం రమేష్ తెలిపారు.

వైకుంఠ ధామం నేలమట్టం

హసన్‌పర్తి: చివరి మజిలీ కోసం చింతగట్టు క్యాంప్ సమీపంలో నిర్మించిన వైకుంఠ ధామాన్ని గుర్తు తెలియని వ్యక్తులు నేలమట్టం చేశారు. ఐదేళ్లుగా ఇక్కడ దహన సంస్కారాలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో వైకుంఠ ధామాన్ని నేలమట్టం చేయడంతో చర్యలు తీసుకోవాలని కాకతీయ యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్‌లో స్థానికులు ఫిర్యాదు చేశారు.



న్యూరాయపురలో శ్రీరామ యూత్ గజానన మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన కుంకుమ పూజలో పాల్గొన్న మహిళలు



న్యూశాయంపేటలో చీరలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి, కార్పొరేటర్ రాజు



కాశిబుగ్గలో నిర్వహించిన అన్నదానంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్



కాజీపేట: గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా చైతన్యపురిలో వివిధ వేషధారణలో చిన్నారులు



64వ డివిజన్ మడికొండలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగరాజు



రెవెన్యూ కాలనీలో గణపతి ప్రతిమ వద్ద పూజలు నిర్వహిస్తున్న కార్పొరేటర్ మానస, మహిళలు



కాశిబుగ్గ మార్కండేయ వీధిలో పూజలు చేస్తున్న భక్తులు